క్లుప్తంగా

అత్తింటివారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ అమీర్‌పేటకు చెందిన బండారులంక కృష్ణవేణికి తొమ్మిదేళ్ల క్రితం పోరంకి నివాసి కనకారావుతో వివాహమైంది. ఆ సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరికి కుమార్తె ఉంది. అయితే భర్తతో పాటు అత్త చెల్లాయమ్మ, మామ కొండయ్య, బావ బండారులంక శ్రీను అదనపు కట్నం కోసం కృష్ణవేణిని తరచూ వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పెనమలూరు: మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన విజయవాడలో జరగనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల ఐద్వా అధ్యక్షురాలు షేక్ వలిమా కోరారు. యనమలకుదురులో గురువారం వెలగా లక్ష్మణరావు భవన్‌లో పోస్టర్ ఆవిష్కరించి ప్రసంగించారు. నేతలు షేక్ హుస్సేన్‌బి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్‌కు యోగాలో బంగారు పతకం



పెనమలూరు: కానూరు వీఆర్‌ సిద్ధార్థ ఇంజినీరింగ్‌కాలేజీలో కంప్యూటర్స్ విద్యార్థి హుస్సేన్ యోగాలో బంగారు పతకం సాధించాడు. ఈ మేరకు కాలేజీలో గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీ బాబు విద్యార్థిని సత్కరించారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ అనుబంధంగా ఉన్న యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ కృష్ణా జిల్లా ఆధ్వర్యాన ఉయ్యూరులో గత నెల 29వ తేదీన జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో హుస్సేన్‌కు బంగారు పతకం పొందాడుర. కార్యక్రమంలో యోగా గురువు మూర్తి పాల్గొన్నారు.

పేరంటాలమ్మ ఆలయానికి ఏసీ బహూకరణ



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయానికి గురువారం గ్రామానికి చెందిన ఆత్మూరి శ్రీనివాస్, అనురాధల కుమారుడు వెంకట సాయి రంగనాథ్ ఏసీని బహూకరించారు. ఆలయంలోని మొదటి అంతస్తులో ఏసీ ఫంక్షన్ హాల్ కోసం దీన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి వీరికి అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదాన్ని అందజేశారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



పెనమలూరు: రాష్ట్ర స్థాయి మానసిక గణిత విశ్లేషణ (అబాకాస్ అండ్ బ్రెయిన్ జిమ్) పోటీల్లో కానూరు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. మలేషియాకు చెందిన సిప్ అకాడమీ ఇండియా రీజినల్ మేనేజర్ ప్రవీణ్ గురువారం కానూరులో వివరాలు తెలుపుతూ కంకిపాడులో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 900 మంది చిన్నారులు పాల్గొన్నారన్నారు. కానూరుకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు గెలిచారన్నారు. కె.అవినాష్ చాంపియన్‌గా నిలిచాడన్నారు. కె.దీక్షిత, కె.అభినవ్, కె.చర్మిష, మానస బిందు, జి.పార్థసాయికిరణ్, సాయి వివిధ క్యాటగిరీల్లో గెలుపొందారని వివరించారు. కార్యక్రమంలో స్టేట్ హెడ్ గోపాలకృష్ణ, సెంటర్ హెడ్ బి.మంజుల పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఉంగుటూరు: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీవీ శేషగిరిరావు తెలిపారు. స్త్రీశక్తి భవనలో మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ వి.సరోజిని అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

చరిత్ర సృష్టించిన జగనన్న సురక్ష

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



పెనమలూరు: జగనన్న సురక్షను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించి చరిత్ర సృష్టించిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చెప్పారు. కానూరులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే పార్థసారథి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానసపుత్రికగా ప్రారంభమైన 'జగనన్న సురక్ష' రాష్ట్రంలో చరిత్ర సృష్టించిందని తెలిపారు. గతంలో ప్రజలు ధ్రువీకరణ పత్రాలను పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారన్నారు. మీ సేవ కేంద్రాల్లో ఫీజులు చెల్లించి పత్రాల కోసం ఎదురు చూసేవారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను పరిష్కరించడానికి 11రకాల సేవలు ఉచితంగా అందించడానికి జగనన్న సురక్షను క్షేత్రస్థాయిలో అమలు చేసిందని వివరించారు. వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని వివరాలు నమోదు చేశారని వివరించారు. జగనన్న సురక్ష గ్రామసభల్లో ఉచితంగా వారం రోజుల్లో ధ్రువీకరణ పత్రాలను అధికారులు జారీ చేశారని తెలిపారు.

నియోజకవర్గంలో 99 శాతం మంది సమస్యల పరిష్కారం..

జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్రంలో 93.57 లక్షల మందికి ధ్రువీకరణ పత్రాలు అధికారులు అక్కడికక్కడే గ్రామసభల్లో జారీ చేశారన్నారు. జూలై నెలలో జరిగిన కార్యక్రమంలో 15,004 సచివాలయాల్లో శిబిరాలు నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో 97 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 93.57 లక్షల మందికి(97 శాతం)సమస్యలు పరిష్కరించారని వివరించారు. పెనమలూరు నియోజకవర్గంలో 44,568 మంది నుంచి అభ్యర్థనలు రాగా 44,076 మందికి (99శాతం) సమస్యలు పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయటానికి కృషి చేసిన వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది. వివిధ శాఖ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం కార్యదర్శి వల్లే నరసింహారావు పాల్గొన్నారు.

అపూర్వ స్పందన

రామవరప్పాడు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం చరిత్ర సృష్టించిందని రూరల్ మండల ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. విజయవాడరూరల్ మండలం నిడమానూరులో గురువారం సర్పంచ్ శీలం రంగారావు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమారి మాట్లాడుతూ జగనన్న సురక్షకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజల వద్దకు పాలనతో అన్ని సేవలను ప్రజలకు చేరువ చేశారన్నారు. రూరల్ మండలంలో 11 రకాల ధ్రువీకరణ పత్రాలు మొత్తం 16 271 మంది లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. జెడ్పీటీసీ సువర్ణరాజు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 1.46 కోట్ల కుటుంబాలను వలంటీర్లు సర్వే చేశారన్నారు. 93.5 లక్షలకు పైగా సర్టిఫికేట్లను జారీ చేసినట్లు వివరించారు. సర్పంచ్ శీలం రంగారావు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో అతి తక్కువ సమయంలో అత్యధిక సేవలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందించి చరిత్ర సృష్టించిందన్నారు. గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ అంజనీకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వెంకటేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ సాదం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివకుమార్, పార్టీ నేతలు

జగనన్న సురక్ష ద్వారా 47,715 సర్టిఫికెట్ల పంపిణీ

గన్నవరం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో 47,715 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేసినట్లు గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ కైలే శివకుమార్ తెలిపారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జగనన్న సురక్షలో భాగంగా నియోజకవర్గంలోని 83 సచివాలయాల పరిధిలో 1,00,805 కుటుంబాలకు అధికారులు వెళ్లి సర్వే చేసినట్లు తెలిపారు. ఈ సర్వేలో కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాలు కోసం 50,453 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. వీటిలో 95 శాతం సర్టిఫికెట్లను సచివాలయ క్యాంప్ కార్యక్రమాల్లో ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ఇంకా పెద్ద ఎత్తున్న ఆధార్ సంబంధిత సేవలను అందించినట్లు చెప్పారు. అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ నేతృత్వంలో నియోజకవర్గంలో చేపట్టిన జగనన్న సురక్ష విజయవంతమైనట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్ష, కన్వీనర్లు పడమట సురేష్, నీలం ప్రవీణ్‌కుమార్, సర్పంచ్‌లు కంచర్ల చిన్నా, నల్లూరి వెంకటేశ్వరరావు, నిడమర్తి సౌజన్య, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ కరిముల్లా, పార్టీ నాయకులు మేచినేని బాబు, జలసూత్రం రామ్మోహన్‌రావు, ఎస్‌కెఎంఎంఏ కలాం, రవి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపం రాకుండా చర్యలు



పౌష్టికాహార కిట్లను అందజేస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి

కంకిపాడు: పోషకాహార పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం పటిష్టంగా, సమర్థంగా అమలుచేస్తోందని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. ఉప్పలూరు పంచాయతీ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ కంకిపాడు ప్రాజెక్టు ఆధ్వర్యంలో టేక్ హోమ్ రేషన్ పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపాలు తలెత్తకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాలతో కూడిన ఆహారాన్ని పంపిణీ చేస్తుందన్నారు. గర్భిణులు, బాలింతలు ఇంటికే ఆహార కిట్లను తీసుకెళ్లేలా మార్పులు తెచ్చిందన్నారు. మాతాశిశువుల సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహార కిట్లు దోహదపడతాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం సోనియా, మాజీ ఉపసర్పంచ్ బందెల సుబ్బారావు, వీఆర్వో దుర్గారావమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లీ బిడ్డల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం



సంపూర్ణ పోషణ కిట్లను అంజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గన్నవరం: తల్లీ బిడ్డల ఆరోగ్య, ఆహార భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు ఎంపీపీ అనగాని రవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోమ్ రేషన్ సరుకుల కిట్లను పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అధిక పోషక విలువలు కలిగిన 11 రకాల రేషన్ సరుకులను ఇంటి వద్దకే అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అప్పుడే తల్లితో పాటు పుట్టే బిడ్డ ఆరోగ్యంగా, దృఢంగా ఉంటారని తెలిపారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి. వెంకటలక్ష్మి అధ్యక్షతన జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని, వైస్ ఎంపీపీ–2 కాలగడ్డ శివనాగరాజకుమారి, ఎంపీడీఓ సత్యకుమార్, ఎంపీటీసీ సభ్యులు పడమట రంగారావు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ కరిముల్లా, పలువురు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి 'సప్తగిరి' లక్ష్యం

బ్యాంక్ ఆర్ఎం శివరామ్‌ప్రసాద్



కోటి రూపాయల చెక్కును అందజేస్తున్న రీజనల్ మేనేజర్ శివరామ్‌ప్రసాద్

కంకిపాడు: మహిళల ఆర్థికాభివృద్ధికి సప్తగిరి గ్రామీణ బ్యాంకు చేయూత అందిస్తోందని సప్తగిరి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ కె.శివరామ్ ప్రసాద్ అన్నారు. మండలంలోని నెప్పల్లి–చలివేంద్రపాలెం బ్రాంచి కార్యాలయంలో గురువారం ఖాతాదారులు, డ్వాక్రా మహిళలకు మంజూరైన రూ.కోటి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో శివరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఇతర బ్యాంకులకు దీటుగా త్వరలోనే డిజిటల్ సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కార్యక్రమంలో గుడివాడ ప్రాంతీయ కార్యాలయ ప్రతినిధి జి.జయరామ్, బ్రాంచి మేనేజర్ కె.షీబారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ సేవకు ప్రశంసలు



ఈదరలో పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ వెంకటలక్ష్మి

గన్నవరం రూరల్: వలంటీర్ల సేవలకు సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. గొల్లనపల్లి సచివాలయంలో వలంటీర్‌గా పని చేస్తున్న గణపవరపు వెంకటలక్ష్మి గురువారం ఏలూరు జిల్లా ఈదర వెళ్లి లబ్ధిదారులకు పింఛను అందించింది. గ్రామానికి చెందిన దోసకాయల పుల్లయ్య పింఛను తీసుకోవడానికి రాలేని వృద్ధాప్య పరిస్థితులలో ఉన్న విషయం తెలుసుకున్న వలంటీర్ అక్కడకు నగదు అందించింది. సర్పంచ్ గణపవరపు శాంతి, పంచాయతీ కార్యదర్శి మారుతీ ప్రసాద్, సచివాలయం కార్యదర్శి శివనాగరాజు, సచివాలయం సిబ్బంది వాలంటీర్‌ను అభినందించారు.

ప్రతిపక్షాల నీచరాజకీయాలను తిప్పికొట్టాలి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



ఉయ్యూరు 20వ వార్డులో సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: ప్రతిపక్షాల నీచరాజకీయాలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. ఉయ్యూరు 20వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించి, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ప్రజాహితమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ప్రజల సంతృప్తికర స్థాయి గతంతో పోలిస్తే పెరిగిందని తెలిపారు. ప్రజలు ఆనందంగా ఉండటాన్ని ప్రతిపక్షాలు చూసి ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. ప్రజల్ని పక్కదారి పట్టించేందుకు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నాయని, అభూత కల్పనలు, అబద్ధాలతో అనుకూల మీడియాతో విష ప్రచారం చేయిస్తున్నాయని విమర్శించారు. సంక్షేమంపై విషం చిమ్ముతున్నాయని ధ్వజమెత్తారు. ప్రజల సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలూ ఏపీలో అమలు జరుగుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలుకు చర్యలు తీసుకుంటున్నాయంటే ప్రభుత్వ పారదర్శక పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ప్రతిపక్షాల కుట్రలను ప్రజలే తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్ అర్షతున్నీసాబేగం, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, కౌన్సిలర్లు గోన మదన్, తెనాలి పద్మావతి, నాయకులు రాజులపాటి రామచంద్రరావు, వణుకూరు సురేష్, కొండపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో మహిళలకు ఎంతో మేలు



గన్నవరం రూరల్: వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు అండగా ఉండాలని తెంపల్లి సర్పంచ్ కొలుసు శిరీషా అన్నారు. గురువారం స్థానిక అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు ఆమె పంపిణీ చేశారు. పౌష్టికాహారంతో రేపటి పౌరులు ఆరోగ్యంగా ఉండాలన్న సదాశయం, మహిళలు రక్తహీనతకు గురికాకుండా మంచి ఆరోగ్యంతో కుటుంబాలను ఉన్నతంగా నిలబెట్టుకోవాలన్న ఆకాంక్షతో ప్రభుత్వం ఖర్చుకు వెనుకాడకుండా పౌష్టికాహారం అందిస్తుందన్నారు. ఇంటికే టేక్ హోం రేషన్ అందిస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంగన్‌వాడీ టీచర్‌లు కల్పన, నాగలక్ష్మి, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు పెంచేందుకు చర్యలు

కృష్ణా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్



వేలేరులో ఆయిల్‌పామ్ మొక్క నాటి నీరుపోస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: కృష్ణాజిల్లాలో ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలని ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ పిలుపునిచ్చారు. బాపులపాడు మండలం వేలేరులో ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవానికి ఆమె హాజరయ్యారు. గ్రామానికి చెందిన రైతు పాలడుగు సత్యనారాయణ పొలంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటి మెగా ప్లాంటేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంతకు ముందు అదే గ్రామంలో డ్రాగన్ ఫ్రూట్ తోటను అపరాజిత సింగ్ పరిశీలించారు. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు పెట్టుబడి, ఉత్పత్తి వ్యయం, మార్కెటింగ్, తదితర వివరాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో కొత్తగా 150 హెక్టార్లలో ఆయిల్ పామ్ తోటల పెంపకం చేపట్టామన్నారు. వేలేరులోనే 125 హెక్టార్లులో తోటల సాగు చేపట్టడం విశేషమన్నారు. గ్రామానికి చెందిన యువరైతు రమేష్ చంద్ర కుటుంబ వారసత్వంగా వ్యవసాయాన్ని స్వీకరించి, వివిధ రకాల పంటలను సాగు చేయటం అభినందనీయమని కొనియాడారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం పలురకాల రాయితీలను అందిస్తోందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూక్ష్మ బిందు సేద్యం చేపట్టేందుకు రూ.29 వేలు, ఎరువులకు మరో రూ.20 వేల ఇన్‌పుట్ సబ్సిడీలను ప్రభుత్వం అందిస్తోందని వివరించారు. ప్రభుత్వ సహాయాన్ని రైతులు అందిపుచ్చుకుని ఆయిల్‌పామ్ సాగులో అధిక దిగుబడులు పొంది, ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. రైతు సమస్యలపై ప్రతి నెలా మొదటి శుక్రవారం ఆయా గ్రామాల్లో ఉండే రైతు భరోసా కేంద్రాల్లో, రెండో శుక్రవారం మండల స్థాయిలో, మూడో శుక్రవారం జిల్లా స్థాయిలో జరిగే వ్యవసాయ సలహామండలి సమావేశంలో చర్చించి పరిష్కరిస్తామని అపరాజిత సింగ్ తెలిపారు. జిల్లాస్థాయిలో పరిష్కారం కానీ సమస్యలు ఉండే వాటిని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సమావేశం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జన్ను రాఘవరావు మాట్లాడుతూ.. వంటనూనెల ఉత్పత్తిలో దేశం స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఆయిల్‌పామ్ తోటల పెంపకానికి రైతులను ప్రోత్సహిస్తోందన్నారు. ఉద్యాన శాఖ అదనపు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, డెప్యూటీ డైరెక్టర్ ధర్మజా, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె.జ్యోతి, జిల్లా సూక్ష్మ సేద్య అధికారి విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, ఉద్యాన అధికారులు హరిచంద్, చందు జోసఫ్ సుందరం, అభ్యుదయ రైతు నందూరు సత్య వెంకటేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎన్నికల నమోదు అధికారి చంద్రలీల, తహసీల్దారు జాహ్నవి

విజయవాడరూరల్: సమగ్ర ఓటర్ల సర్వే కార్యక్రమాన్ని ఈ నెల 21వ తేదీ నాటికి పూర్తి చేయాలని, గన్నవరం నియోజకవర్గం ఎన్నికల నమోదు అధికారి బి. చంద్రలీల అన్నారు. విజయవాడ రూరల్ మండల తహసీల్దారు కార్యాలయంలో పోలింగ్ బూత్‌స్థాయి అధికారుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రలీల మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల సర్వేను సజావుగా నిర్వహించాలని సూచించారు. సమగ్ర ఓటర్ల సర్వేకు అవసరమైన 12 రకాల ఫారాలను బీఎల్‌ఓలకు అందచేశారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు. ఎన్ఆర్ఐలకు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేకంగా ఓటర్ల జాబితాలో వివరాలు పొందుపర్చాల్సి ఉందన్నారు. సహాయ ఎన్నికల నమోదు అధికారి, రూరల్ మండల తహసీల్దారు, పి.జాహ్నవిరెడ్డి, అదనపు ఎన్నికల నమోదు అధికారి, ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు, డెప్యూటీ తహసీల్దారు గోపాలరెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన



విద్యార్థులతో వైద్యబృందం

గుడివాడ టౌన్: మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా వస్తున్న వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ కేఏఎస్ చక్రవర్తి అన్నారు. స్థానిక కేటీఆఆర్ మహిళా కళాశాలలో గురువారం విద్యార్థులకు మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడం వలన నిమ్ము, వైరల్ ఫీవర్‌లు వంటి వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తరచూ చేతులు కడుక్కోవడం, పొడి దుస్తులు ధరించడం వంటివి చేయాలని తెలిపారు. అనంతరం కళ్ల కలకలు రాకుండా ఉచిత హోమియో మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కల్పన, మానవతా స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపకులు గుత్తా రమేష్, జిల్లా అధ్యక్షుడు పీవీ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులకే గిట్టుబాటు ధరలు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుధారాణి

పామర్రు: నాణ్యమైన ఉత్పత్తులకే ఎగుమతుల అవకాశంతో పాటు గిట్టుబాటు ధరలు లభిస్తాయని ఏఆర్ఎస్ ఉయ్యూరు కీటక శాస్త్రవేత్త డి. సుధారాణి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులోని ఆర్‌బీకే -1 వద్ద రైతులకు ఏపీ ప్రభుత్వం వ్యవసాయశాఖ విత్తనోత్పత్తి పథకంపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిమితికి మించి రసాయనాలు వాడకం వల్ల పంట నాణ్యత దెబ్బతింటుందని తెలిపారు. సాగులో అవసరాన్ని మించి పెట్టుబడులు పెట్టినా కూడా దిగుబడుల్లో ఏమీ మార్పు ఉండని రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరిలో కలుపు సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు వివరించామన్నారు. డీఆర్‌సీ డీటీసీ కె.జ్యోతిరమణి మాట్లాడుతూ వరి పంటలో ఎరువుల యాజమాన్య పద్ధతులు అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. అనంతరం గ్రామంలో ముంపునకు గురైన వరి పొలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఏడీఏ స్వర్ణలత, డీఆర్‌సీ ఏడీఏ కె. శ్రీనివాసరావు, ఏవో నాగరాణి, మండల ఆర్‌బీకే అధ్యక్షులు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్తపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కలరా హాస్పిటల్ ప్రాంతానికి చెందిన కట్టా నవ్యశ్రీ దుర్గ 2019లో శ్రీనివాసమహల్ ప్రాంతానికి చెందిన శ్రీనును ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఒక పాప సంతానం. మార్బుల్ పని చేసే శ్రీను కొంత కాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్యను, పాపను పట్టించుకోవడం లేదు. కొద్ది రోజులుగా శ్రీను వాళ్ల అమ్మానాన్నలకు దగ్గరకు వెళ్లిపోయాడు. కాపురానికి ఇకపై రానని చెబుతూ భార్యను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఉచితంగా హోమియో మందుల పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రస్తుత వాతావరణ మార్పుల నేపథ్యంలో అధికంగా వ్యాపిస్తున్న కళ్లకలకలు వ్యాధి నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైష్ణవి ఫౌండేషన్ చైర్మన్ పరుచూరి రామకృష్ణ, మమతల పందిరి వ్యవస్థాపక అధ్యక్షుడు లంక రమేష్ అన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలో కళ్లకలకల నియంత్రణకు ఉచితంగా హోమియో మందులను వైష్ణవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన 320 మందికి హోమియో మందులు అందజేశారు. కళ్లలో ఎటువంటి ఇన్‌ఫెక్షన్ సోకకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైష్ణవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొత్తం వెయ్యి మందికి పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.